పంటలపై 'బయో' ఎఫెక్ట్

- విచ్చలవిడిగా నకిలీ మందుల విక్రయాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


చిన్నంబావి శివారులో డ్రోన్‌తో వరి చేను మందు స్ప్రే చేస్తున్న రైతు

చిన్నంబావి: రైతులు వ్యవసాయంలో మరింత రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. అన్నదాతలు ఆర్థిక స్వావలంభన సాధించాలనే సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. కానీ క్షేత్రస్థాయిలో రైతు పండిస్తున్న పంటకు ఎలాంటి మందులు పిచికారీ చేయాలనే దానిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నట్లు కనిపిస్తోంది. మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ పురుగు మందుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కొందరు క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువుల అమ్మకందారులు నాణ్యత లేని మందులను రైతులకు అంటగట్టి పబ్బం గడుపుకుంటున్నారు. నకిలీ మందులను అధిక ధరలకు విక్రయిస్తూ కొందరు డీలర్లు రైతులను నిండా ముంచుతున్నారు.

విచ్చలవిడిగా బయో మందులు

మండలంలోని జూరాల చివరి ఆయకట్టు కింద 22వేల ఎకరాల్లో మినుములు, పప్పుశనగ, మిరప, మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. దీనికి తోడు కృష్ణానదిలో నీరు ఎండిపోతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు ముంపు భూమి వేల ఎకరాల్లో పప్పుశనగను, వేరుశనగ, మినుములను రైతులు సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు పురుగు మందులపై అవగాహన లేకపోవడంతో ఇదే అదనుగా మండల కేంద్రంలోని పలు దుకాణ యజమానులు బయో మందులను రైతులకు అంటగడుతున్నారు.

అధిక లాభాలకు..

కొన్ని బయో మందుల కంపెనీలు కోర్టు ద్వారా అనుమతి పొంది ప్రొడక్టులను తయారు చేసి డీలర్లకు అందిస్తుంది. ఇదే అదునుగా డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు కలిసి నకిలీ మందులను సైతం అవే బ్రాండ్ల కింద రైతులకు విక్రయించి నట్టేట ముంచుతున్నారు. బయో మందులలో ఒక్క లీటరుపై 50 శాతం నుంచి 70శాతం వరకు లాభాలు, డీలర్ల కమీషన్ వస్తుండడంతో ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు వీటిని కట్టబెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

చిన్నంబావి మండలంలో ఎక్కువగా వాణిజ్య పంటలను సాగు చేస్తుండటంతో మండల కేంద్రంలో విచ్చలవిడిగా ఫర్టిలైజర్ దుకాణాలు వెలిశాయి. క్షేత్రస్థాయిలో అధికారులు దుకాణాలను పరిశీలించకపోవడం, ఉన్నతాధికారులు సైతం నిఘా లేకపోవడంతో ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు బహిరంగంగానే రైతులకు బయో మందులను విక్రయిస్తున్నారు. నకిలీ మందులపై అవగాహన కల్పించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫర్టిలైజర్ దుకాణాలకు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

నకిలీ మందులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. బయో మందులను వాడటం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడిపై భారం పడుతుంది. రెండు, మూడేళ్లుగా కొత్త దుకాణాలు వచ్చాయి. నకిలీ మందులు, బయోలను విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఎవరైనా దొంగతనంగా విక్రయించిన వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

– దాశేశ్వర్‌గౌడ్,
మండల వ్యవసాయాధికారి

'చలో నల్లగొండ' వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం కేఆర్‌ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టులను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో నల్గొండ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కొత్తకోటలో బీఆర్‌ఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ కృష్ణా బేసిన్ ప్రాజెకులను కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు పరిధిలోనికి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యవసాయ రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా బీఆర్‌ఎస్ పార్టీ ఖండిస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న చలో నల్గొండ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత, విశ్వేశ్వర్, చీర్ల నాగన్నసాగర్, బాబురెడ్డి, కె.శ్రీనివాస్‌జీ, వెంకటేశ్వర్‌రెడ్డి, హోటల్ రాజు, చాంద్‌పాషా, లక్ష్మణ్‌నాయక్, వినోద్‌సాగర్, గోవర్ధన్‌నాయుడు, జలేందర్ రెడ్డి, కిరణ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి


కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీని టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ తెలిపారు. అధ్యక్షుడిగా గాదం నరేష్, ఉపాధ్యక్షులుగా కావలి సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శిగా మేకల రవియాదవ్, సంయుక్త కార్యదర్శిగా చినకనపాగ రాముడు, మండ్ల కురుమూర్తి, కోశాధికారిగా ఎండీ మహబూబ్, గౌరవ సలహాదారుగా అయ్యపురెడ్డి, గుజ్జుల కుర్మయ్య, శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేయడంతో పాటు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, మాసన్న, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు


చేతులు కడిగే విధానం విద్యార్థులకు చూపుతున్న వైద్య సిబ్బంది

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అధికారులు ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ రాజు, తహసీల్దార్ పాండు నాయక్, ఏఈలు కబీర్‌దాసు, వెంకటేశ్వర్లు, ఏఓ మల్లయ్య విద్యార్థులకు పరిశుభ్రత విషయాలను వివరించారు. ఆశాకార్యకర్తలతో ప్రతి రోజు గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అవగాహన కలకల్పించారు. అదేవిధంగా మురుగు కాలువలు శుభ్రం చేయడం, కంపచెట్ల తొలిగింపు, రోడ్లు శుభ్రపర్చడం, మరుగుకాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం లాంటి పనులు చేపట్టారు. ఈ నెల 15వ తేది వరకు కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

అధ్యాపకుడికి సత్కారం

కొల్లాపూర్: శ్రీరంగాపూర్ చరిత్ర, సంస్కృతి అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దాసరి శివుడు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని కళాశాలలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్‌తో పాటు సహ అధ్యాపకులు శాలువాలు, పూలమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

సకాలంలో పంట రుణాలు చెల్లించాలి

వీపనగండ్ల: రైతులు బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని స్థానిక ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ మేనేజర్ రవీందర్‌బాబు అన్నారు. బ్యాంక్ పరిధిలోని పలు గ్రామాల రైతులు పైపులైన్ల కోసం మార్టేజ్ రుణాలు తీసుకొని దీర్ఘకాలికంగా వాటిని చెల్లించలేదన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఈ డబ్బులను చెల్లించే అవకాశం ఉన్నతాధికారులు కల్పించారని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెద్దకొత్తపల్లి వాసికి డాక్టరేట్



పెద్దకొత్తపల్లి: పాలమూరు విశ్వవిద్యాలయంలో దశాబ్ద కాలంగా అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్న ఆదేర్ల కరుణాకర్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ మధుమతి పర్యవేక్షణలో కంప్యూటర్ సెల్ఫ్‌ఎఫికసి, కంప్యూటర్ ఆక్సిటీ అండ్ అట్టిట్యూడ్ టు వర్డ్స్ బీ లర్నింగ్ అమాంగ్ బీ ఎయిడ్ స్టూడెంట్స్ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. కరుణాకర్‌రెడ్డిని పీయూ వీసీ ఎల్‌బీ లక్ష్మికాంత్ రాథోడ్‌తో పాటు పెద్దకొత్తపల్లి గ్రామవాసికి డాక్టరేట్ రావడంపై మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, లక్ష్మికాంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డిలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురువ జయరాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాబితాలోని ఉపకులాలన్నింటినీ ఎస్సీ(ఏ) గ్రూపులో చేర్చాలన్నారు. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తెలంగాణ ప్రభుత్వ వాదన వినిపించేందుకు న్యాయవాదిని పంపడం హర్షణీయమన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం స్పందించి పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోపు వర్గీకరణ బిల్లును ఆమోదించాలని కోరారు. సమావేశంలో నాయకులు మాదాసి, మాదారి కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీరయ్య, ఈదన్న, వెంకటస్వామి, శేషయ్య, మల్లయ్య తదితరులున్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి


అమరచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష రైతు సంఘాల నాయకులు

అమరచింత: దేశవ్యాప్త ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని పట్టణంలో శనివారం వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐకేఎస్, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐకేఎంఎస్ సంఘాల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేసి, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో జీఎస్ గోపి, రాజన్న, అజయ్, వెంకటేష్, ప్రసాద్, అబ్రహం, శ్యాంసుందర్, ఆర్‌ఎస్.రమేష్, రాజు, ప్రేమరత్నం పాల్గొన్నారు.

చిన్నంబావి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు కోరారు. ఈసందర్భంగా మండలకేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రతి దుకాణానికి వెళ్లి ఈ నెల 16వ తేదీన చేపట్టిన సమ్మెకు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వేంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, పుల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దుప్పల్లిలో..


చిన్నంబావిలో..

మదనాపురం: ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వెంకట్రాములు, ప్రసాద్, చెన్నయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ రాజు అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-3 కేంద్రంలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు మంజుల రాణి, కార్యదర్శి నందకిషోర్, ఆశావర్కర్ జ్యోతి, శివకుమార్, ఉష, జయశ్రీ, సువర్ణ, మాధవి, రాములమ్మ, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం నందు జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ పొందిన 20మంది విద్యార్థులు ఆదివారం అర్హత పరీక్షలు రాయనున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్, కోఆప్షన్ సభ్యుడు జేఎం మిషేక్, బీఎస్పీ నాయకులు డేవిడ్‌రాజ్ పరీక్ష ప్యాడ్లను అందజేశారు. శిక్షణ తీసుకున్న ప్రతి విద్యార్థి సీటు సాధించాలని సూచించారు. పరీక్షను భయంతో రాయకూడదన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన టీచర్లు అనిల్, జే అనిల్ ను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా ఫ్రూట్స్ డే



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని నివేదిత స్కూల్‌లో పాఠ్యాంశాలలో భాగంగా శనివారం ఫ్రూట్స్ డే సెలబ్రేషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థులు ప్రకృతిలో అందుబాటులో ఉండే వివిధ రకాల పండ్ల వేషాధారణలో పాల్గొని వాటి పేర్లు, వాటిని తినడం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం పండ్లు తినడం వలన ఆరోగ్యం ఎంత చక్కగా ఉంటుందో అనే విషయాన్ని పాటలకు అనుగుణంగా అభినయం చేస్తూ చెప్పడం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఏఓ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వీణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరమ్మ, రాణి, నందిని, ప్రీతి, ఆశ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

డాటాలో తప్పులు ఉండొద్దు



కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రజాపాలనలో అర్హుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. అర్హులైన వారి డాటా నమోదు ప్రక్రియ పెద్దమందడి మండలంలో జోరుగా కొనసాగుతుంది. శనివారం మండలంలోని మనిగిళ్లలో డాటా నమోదును ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 కు సబ్సిడీ సిలిండర్ ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్న వారు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మళ్లీ మహాలక్ష్మి పథకం ఆన్‌లైన్ గ్యాస్ నంబర్‌ను సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణనాయక్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ప్రతిగడపకు కేంద్ర పథకాలు

పెబ్బేరు రూరల్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. చలో అభియాన్‌లో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమంలో శనివారం ఆయన మండలంలోని అయ్యవారిపల్లిలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం వందలాది సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో వినోద్ సాగర్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.



ఇంగ్లిష్ సబ్జెక్టుపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుపై పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శనివారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తొలి మెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల నిర్వహణపై పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్పీ రవికుమార్ ఇంగ్లిష్ సబ్జెక్టుపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో సీఆర్పీలు, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణిస్తేనే భవిష్యత్


కేతేపల్లిలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

వీపనగండ్ల: విద్యార్థులు పలు రకాల పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభను కనబర్చినప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని బాలికలకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజు భోజనం పరిశీలిస్తూ నాణ్యత లోపించకుండా తగు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన రివిజన్ టెస్టు పరీక్షలను ఎంఈఓ పరిశీలించారు.

ప్రతిభ గుర్తింపునకే పరీక్షలు

పాఠశాలల్లోని విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకే ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. పాఠశాలల్లో నిర్వహించిన బాలసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పాటలు, కవితలు, పద్యాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి అయిన ఎంఈఓను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయ బృందం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఎంఈఓగా రాధిక, హెచ్‌ఎంగా కార్తీక్ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వరలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా మాధవి, అదనపు కలెక్టర్‌గా నక్షత్ర, గౌతమి, డీఈఓగా ఐశ్వర్య, నందిని, హెచ్‌ఎం ప్రశాంతి వ్యవహరించారు. ఉత్తమంగా విద్యాబోధన చేసిన విద్యార్థి ఉపాధ్యాయులు మొదటి బహుమతి తరుణి, రెండోది రాధిక, మూడో శిరీషకు హెచ్‌ఎం సరస్వతి బహుమతులు అందజేశారు.


కల్వరాల ప్రాథమిక పాఠశాలలో..

చౌడేశ్వరిదేవికి గంగస్నానం

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో చౌడేశ్వరీ జాతర సందర్భంగా శనివారం అమ్మవారికి గంగ స్నానం చేయించారు. యాదవులు కుర్వ డోళ్లు, భాజా భజంత్రీలతో అమ్మవారిని గంగస్నానానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుర వీధుల్లో భక్తులు అమ్మవారికి నిండు బిందె నీళ్లతో పూజలు చేశారు. అనంతరం రాత్రి పదకొండు గంటల నుంచి ఆదివారం తెల్లవారు జామున వరకు అమ్మవారి పల్లకీసేవ, జ్యోతుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చౌడేశ్వరి దేవి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సోమవారం రాత్రి వరకు అమ్మవారిని భక్తుల సందర్శన కోసం చిన్న చౌడేశ్వరీ ఆలయంలో ఉంచుతారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులను భవితకు పంపాలి


అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ యుగంధర్

వనపర్తి టౌన్: ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ప్రతి శనివారం అందిస్తున్న ఇంటి వద్దకే విద్య (హెచ్‌బీఈ) కార్యక్రమాన్ని శనివారం ఐఈ కోఆర్డినేటర్ యుగంధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బయట అవసరం ఉన్న విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రానికి పంపాలని తెలుపుతూ, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రతి మండలంలో ఐఈఆర్పీ ఉపాధ్యాయులతో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు (సీడబ్ల్యూఎస్‌ఎన్) విద్యతో పాటు, అనేక రకాల నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణను ఇస్తూ, ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ చేస్తున్నటు చెప్పారు. అవసరమైన విద్యార్థులకు వీల్ చైర్స్, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు మొదలైన ఉచిత ఉపకరణాలను అందిస్తామన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్‌లో రూ. 550, ట్రావెలింగ్‌కు రూ. 500, బాలికలకు స్టైఫండ్ రూ. 200లను ప్రతి నెల అందిస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల స్కాలర్‌షిప్ పథకాలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి భక్తులు తెల్లవారు జాము నుంచి నల్లటి వస్త్రాలతో జిల్లేడు పుష్పాలు, తిలతైలాభిషేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.